క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు నేడు(మంగళవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిది ద్విచక్ర వాహనాలకు వేలం వేయడం జరగుతుందని ఆసక్తిగల వారు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సెంట్రింగ్ లోడ్ ట్రాక్టర్ బోల్తా..



గణపురం: మండలంలోని కర్కపల్లి వద్ద సెంట్రింగ్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఆదివారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన మహంకాళి, ఇసాక్, బాబురావులతో మరో ఇద్దరు కాటారంలో సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో కాజీపేటలో సెంట్రింగ్ విప్పుకొని ట్రాక్టర్‌లో లోడింగ్ చేసుకొని కాటారం వెళ్తున్న క్రమంలో కర్కపల్లి వద్దకు రాగానే ట్రాక్టర్ అతి వేగంతో ఉండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. సెంట్రింగ్ కర్ర లోడ్ పైన కుర్చున్న వ్యక్తులు గమనించి పైనుంచి దూకారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన ఉన్న మహాంకాళికి తీవ్ర గాయాలు కావడంతో ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగత వారిని 108 వాహనంలో ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మొగుళ్లపల్లి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముల్కలపల్లి గ్రామ శివారులోని బంగ్లాపల్లి రోడ్డు ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు చిట్యాల మండల కేంద్రానికి చెందిన ఓర్సు రవి(48) ఆర్థిక, వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది ముల్కలపల్లి గ్రామ శివారులోని బంగ్లాపల్లి రోడ్డు ప్రాంతంలో నిర్మానుష్య ప్రదేశానికి చేరుకుని పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని చరవాణి ద్వారా చిట్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సమాచారం అందించాడు. దాంతో సదరు వ్యక్తి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా వారు సంఘటన స్థలానికి చేరుకొని వెతకగా అపస్మారక స్థితిలో ఉన్న రవిని గుర్తించి చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఈతకు వెళ్లొద్దు

మంగపేట: పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన సందర్భంగా మండలంలోని విద్యార్థులు ఈత కోసం గోదావరి, చెరువులు, బావుల్లోకి దిగొద్దని ఎస్సై గోదరి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరదాగా ఈత కోసం వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని అన్నారు. మండుతున్న ఎండలతో రోజురోజుకు పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఇళ్లలోనే ఉంటు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, పిల్లలను వారి తల్లిదండ్రులు బయటకు వెళ్లకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్సై కోరారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ



వెంకటాపురం(కె): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సోమవారం మండల కేంద్రంలోని పెరిక బజారులో బీఎల్‌ఓ మీనాకుమారి ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందజేశారు. మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్‌లను అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన అన్నగోని రాజయ్య, వేముల మొగిలి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ సోమవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయపాల్‌రెడ్డి, జనార్దన్, కై రి మొగిలి, భిక్షపతి, మొగిలి, సదానందం, సాంబయ్య ఉన్నారు.

వేసవిలో భలే గిరాకీ!

- జోరందుకున్న కూలర్ల వ్యాపారం
- పుచ్చకాయలు, శీతల పానీయాల వైపు ప్రజల చూపు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూలర్లు

మహాముత్తారం: మండల కేంద్రాన్ని ఆనుకొని అడవులు ఉండటంతో ఆ అడవులు ఎలుగడ పడటంతో ఉక్కపోతతోపాటు ఎండలు అధికంగా ఉంటున్నాయి. దీంతోపాటు వేడి గాలులు వీస్తుండటంతో ప్రజలు బయటికి వెళ్లడానికి అపసోపాలు పడుతున్నారు. ఇళ్లలో ఉక్కపోత అధికమవుతుండడంతో ప్రజలు కూలర్లు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో కూలర్ల దుకాణాలకు గిరాకీ పెరిగింది. మార్కెట్లో వ్యాపారులు వివిధ రకాల కూలర్లను అందుబాటులో తెస్తుండటంతో కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పట్టణప్రాంతాలకు వెళ్లి కూలర్లను ఆటోలలో గ్రామాలకు తీసుకువెళ్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం రూ.3000 నుంచి రూ.6000 వరకు ధర కలిగిన కూలర్లను కొనుగోలుదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. వేసవిలో పేద, మధ్య తరగతి ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువగా కూలర్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఎండ వేడిమి నుంచి కొంత మేర ఉపశమనం పొందుతున్నారు. అలాగే ప్రజలు ఎండ వేడిని తాళలేక శీతలపానీయాలు, పుచ్చకాయలు, ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తూ ఉపశమనం పొందుతున్నారు. ఎండ వేడిమికి పుచ్చకాయలకు, కొబ్బరిబోండాలకు ఒక్కసారిగా గిరాకీ పెరిగింది. ఒక్కో కొబ్బరిబోండాకు రూ.45 కాగా పుచ్చకాయకు రూ.80 నుంచి 100 వరకు ధర పలుకుతుంది.

గిరాకీ పెరిగింది

వేసవి కావడంతో కూలర్ల విక్రయాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూలర్లు కొనుగోలు చేస్తున్నారు. ధరలు కూడా అందుబాటులో ఉండటంతో కూలర్లు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

\- శ్రీనివాస్, వ్యాపారి

మోదీ పాలనలో ప్రజలకు అన్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: పదేళ్ల మోదీ పాలనలో దేశంలోని ప్రజలకు ప్రయోజనాలు ఏమి లేవని అన్యాయమే జరిగిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఐ, సీపీఎం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మోదీ రెండు పర్యాయాల్లో ఎన్నికల ముందుకు దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ఉన్న చట్టాలను కాలరాస్తూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కార్మిక చట్టాలను కుదించి నల్లా చట్టాలు తీసుకువచ్చారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టినట్లు ఆరోపించారు. రైతులు 400 రోజులు ధర్నాలు చేసి 760 మంది చనిపోయిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దేవుళ్లు, కులాలు, మతాలు, కులాల పేరుతో రాజకీయం చేస్తున్నారని, దేశ వ్యవస్థ అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందన్నారు. నేడు(మంగళవారం) రేగొండ మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరువుతారని నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్న ఇండియా కుటమి కాంగ్రె స్ పార్టీ అభ్యర్థులను భారీ మోజారిటీలో గెలించేందుకు కృషి చేస్తామని సీపీఐ, సీపీఎం పార్టీల జిల్లా కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, బందు సాయిలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, రమేష్, కిషన్, రాజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి బీఆర్‌ఎస్ ఎంపీటీసీ పెరుమాండ్ల చంద్రకళమొగిళితో పాటు వెంకట్రావుపల్లి, బూర్నపల్లి గ్రామానికి చెందిన 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కత్తి సంపత్, సంగి రవి, శాస్త్రాల కిరణ్, నాంపెల్లి వీరేశం తోడేటి కుమార్, వంగ కుమారస్వామి ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల: ప్రజలందరూ స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని పలిమెల ఎస్సై తమాషారెడ్డి అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మోదేడు గ్రామంలో సోమవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తమాషారెడ్డి గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు లేదా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో అడవి జంతువుల వేట కోసం ఎవరైనా తీగలు అమర్చినట్‌లైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తుల సమాచారం అందించిన వారి వివరాలు కూడా గోప్యంగా ఉంచుతామని, అలాగే వారికి తగిన పారితోషికం ఇస్తామని తెలిపారు. అనంతరం మోదేడు గ్రామంలోని వేటగాళ్లను పోలీస్‌స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అడవి ప్రాంతంలో అడవి జంతువుల వేటకు ఉచ్చులు, తీగలు అమర్చినట్‌లైతే ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని రిమాండ్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడ్డ పంకెన గ్రామ ట్రాక్టర్ డ్రైవర్ అసోసియేషన్ నాయకులు ఎస్సైని కలిసారు. వాహనాలు నడిపే వారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండేలా చూసుకోవాలని ఈ సందర్భంగా ఎస్సై వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, టీఎస్ఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన చల్ల నారాయణరెడ్డి

కాటారం: కాటారానికి చెందిన సీనియర్ నాయకుడు చల్ల నారాయణరెడ్డి సోమవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురగన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టే దిశగా తన వంతు కృషి చేస్తానని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత



రాముని అప్పగిస్తున్న సభ్యులు

కాటారం: మతిస్థిమితం కోల్పోయి మూడేళ్ల క్రితం ఇంటి నుంచి పారిపోయిన ఓ వ్యక్తిని సోమవారం కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు స్టాటిక్ సర్వే లైన్స్ బృందం సభ్యులు. వివరాల్లోకి వెళ్తే పెద్దపల్లి జిల్లా గుంపులకు చెందిన సాదా రాము మతిస్థిమితం కోల్పోయి మూడు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకి తెలియరాలేదు. కాగా రాము సోమవారం కాటారం మండలం మేడిపల్లి వద్ద ఎలక్షన్ నిమిత్తం ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వే లైన్స్ బృందం కంటపడ్డాడు. దీంతో రాము కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకొని వారికి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు మేడిపల్లి చేరుకొని రాముని తమ వెంట తీసుకెళ్లారు. మూడేళ్లుగా ఎక్కడ వెతికిన రాము ఆచూకి దొరకలేదని ఎస్ఎస్ బృందం సభ్యులు, పోలీసుల సహకారంతో రాము తమ చెంతకు చేరాడని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్ఎస్ బృందం సభ్యులు, పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'జన జాతర'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దొడ్డి కిష్టయ్య

చిట్యాల: రేగొండ మండల కేంద్రలలో నేడు(మంగళవారం) నిర్వహించనున్న జన జాతర సభకు జిల్లా నుంచి అన్ని మండలాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించేందదుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తీసేస్తామని బహిరంగంగా ప్రకటన చేస్తున్న బీజేపీ నాయకులకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. రిజర్వేషన్లు తొలగిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేదలు నిరుపేదలుగానే మిగిలిపోతారన్నారు. కావున ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు అత్యధిక మెజార్టీని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏకు రవీందర్, కొడారి సారయ్య, నేరేళ్ళ సమ్మయ్య, రాజమౌళి, నాసర్, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ప్రజాసామ్యానికి తూట్లు పొడిచే పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ)జిల్లా కన్వీనర్ కర్ణాటక సమ్మయ్య, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఓటర్లకు పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 28న హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో సమూహక సాహిత్య సదస్సు నిర్వహించగా ఉద్దేశపూర్వకంగానే కొందరు మతోన్మాదులు కావాలని కవులు, కళాకారులు మేధావులు సామాజిక వేత్తలపై దాడి చేయాలనే విరుచుకుపడ్డారని ఆరోపించారు. అల్లరి మూకలు చేసిన నినాదాలను గమనించినట్లయితే రాబోవు కాలంలో సమాజంలోని ప్రశ్నించే శక్తులలపై జరిపే దాడులకు రిహార్సల్‌గా మనం భావించాలన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని వ్యతిరేకించే శక్తులు ఒకటై తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తిచేశారు. ప్రజాస్వామిక విప్లవ ఉద్యమాలకు కేంద్రమైన వరంగల్ గడ్డ మీద కవుల మీద దాడి చేయడం ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని స్పష్టం చేస్తున్నదన్నారు. దేశంలో పెరిగిపోతున్న ఫాసిస్టు శక్తులను ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ రత్నం కిరణ్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పీక కిరణ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో భాగంగా ముందుగా స్వర్గీయ ప్రధానోపాధ్యాయుడు భీంరావ్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గతంలో అదే పాఠశాలకు చెందిన గురువులు, తోటి పూర్వ మిత్రులు మృతి చెందగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం గత జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్, తిరుపతి, శ్యాంసుందర్, రాజేందర్, సాంబయ్య, తిరుపతి, శారద, ఆశాజ్యోతి, కళావతి, మమత, మాధవి, సరిత, కవిత, రవీందర్, శ్రీనివాస్‌రావు, అశోక్, సదానందం, సత్యం, చందు, రమేష్, మల్లయ్య, రాంచందర్, కుమార్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి దీవెనలు ఉండాలి

టేకుమట్ల: శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని పంగిడిపల్లి–వెలిశాల శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఆయన వెంట నాయకులు తిప్పిరెడ్డి క్రిష్టారెడ్డి, వైనాల రవిందర్, గట్టయ్య, కత్తి సంపత్, తోడేటి కుమార్, రాంపెల్లి వీరేశం, సట్ల కొమురయ్య, చిరంజీవి, కమ్రుద్దిన్, వంగ నరేష్, బొల్లికొండ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పలిమెల: మండలంలోని అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని ఆయా పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ కూలీల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, మందులను ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ పూనెం రామారావులు ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ సమస్యలు తలెత్తకుంగా గ్రామాల్లోని ఆశ వర్కర్లు ప్రతి రోజు ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీలకు ఏమైనా గాయాలు తగిలితే వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లు దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ మాషుక్ అలీ, ల్యాబ్ టెక్నిషియన్ సుధాకర్, ఫార్మసిస్ట్ లక్ష్మి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే చర్యలు

కాటారం(మహదేవపూర్): వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని మహదేవపూర్ ఎస్సై చక్రపాణి హెచ్చరించారు. మండలంలోని పెద్దంపేటలో సోమవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు..

పెద్దంపేటలోని ఓ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు. రూ.5వేల విలువ చేసే మద్యంను స్వాధీనపర్చుకొని మల్లక్క అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఏటూరునాగారం: ప్రచారం చేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గ కోర్డినేటర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో చేయి గుర్తుకు ఓటు వేసి ఎంపీ బలరాంనాయక్‌ను గెలిపించాలని ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ పాలనలో పేదలు ఆర్థికంగా వెనకబడుతున్నారని అన్నారు. ప్రజలందరు టాక్స్‌లు కడుతుంటే మోదీ కార్పొరేటర్‌లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు బాలరాజు, భాగ్య, శివ, నాగరాజు, ముత్తేష్, రంజిత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మార్పు సాధ్యం

మంగపేట: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మార్పు సాధ్యమని ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జ్ వెంకన్న, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య హాజరై మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. అనంతరం మండలంలోని రమణక్కపేట, రాజుపేటకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పయ్యావుల నర్సింహారావు, బొనుగు వెంకటేశ్వర్రావుతోపాటు మరో 35 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆక రాధాకృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి పూజారి సురేందర్, జిల్లా మండల నాయకులు కారుపోతుల నర్సయ్యగౌడ్, తుమ్మూరి రాంరెడ్డి, పల్లికొండ యాదగిరి, చౌళం వెంకటేశ్వర్లు, మల్లయ్య, వల్లెపెల్లి శివప్రసాద్, యానయ్య, చందర్లపాటి శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మానుకోటలో కాంగ్రెస్ ఎంపీగా అభ్యర్థి బలరాం నాయక్‌ను గెలిపించాలని పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ గడ్డ దేవేందర్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్‌పాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బలరామ్ నాయక్‌ను గెలిపించి సోనియ గాంధీకి కానుగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, జాడి రాంబాబు, గడ్డం నాగేష్ ,పల్లా లచ్చబాబు, అబ్బు రమేష్, తాటి రాజబాబు, సునార్కని సాంబశివరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో వార్షికోత్సవ పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో 23వ వార్షికోత్సవ పూజలను అర్చకులు ఎల్లాప్రగఢ భానుప్రకాశ్‌శర్మ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి ఆలయంలో పంచామృత అభిషేకాలు, పుష్పార్చన పూజలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు కాగడ హారతి చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ మండల రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో భక్తులతో రద్దీ నెలకొంది.

అన్యువల్ డే వేడుకలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో టీచర్లు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల అంగన్‌వాడీ 1, 2 కేంద్రాల్లో అన్యువల్ డే వేడుకలను సోమవారం నిర్వహించారు. సీడీపీఓ రాధికా ఆదేశాలతో 1, 2వ కేంద్రాల టీచర్లు మచ్చ శైలజ, ఒద్ది ఉమామహేశ్వరీల ఆధ్వర్యంలో గర్భిణీలకు, బాలింతలకు సలహాలు, సూచనలు అందజేశారు. చిన్నారులు పౌష్టికాహారం అందజేయాలని తల్లులకు సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410